ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిల్లా స్వీప్ నోడల్ అధికారి అఖిలేశ్‌రెడ్డి

ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా స్వీప్ నోడల్ అధికారి అఖిలేశ్‌రెడ్డి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 2: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని చేసుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి అఖిలేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం తారా ప్రభుత్వ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ స్థాయి స్వచ్ఛభారత్, ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. అనంతరం తారా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో షహీద్ దివస్ వారోత్సవాల్లో భాగంగా కళాశాల ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించినట్లు తెలిపారు. దాదాపు 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలిగించారు. అనంతరం ఓటు హక్కుపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ అభిజిత్, డాక్టర్ వెంకటేశం, డాక్టర్ సిద్ధులు, శివదీప్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు

మండల పరిధిలోని దత్తత గ్రామాలైన చింతలపల్లి, కులబ్‌గూర్, అంగడిపేటలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక వేసవికాల శిబిరాలు కొనసాగుతున్నాయి. ప్రతి రోజూ గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తూ వివిధ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం శిబిరానికి సంగారెడ్డి బ్లడ్ బ్యాంక్ అధికారి విజయ్ హాజరై రక్తదానం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

తహసీల్దార్ రాజిరెడ్డి ఎదుట పాత నేరస్తులను బైండోవర్ చేసిన పోలీసులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 2: ఎన్నికల నియమావళి అమలులో భాగంగా మంగళవారం మండలంలోని పాత నేరస్తులను బైండోవర్ చేసినట్టు హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ నేరాలకు పాల్పడిన 11మంది పాత నేరస్తులను అరెస్ట్ చేసి న్యాల్‌కల్ తహసీల్దార్ రాజిరెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. అనంతరం ఎస్‌ఐ రామానాయుడు మాట్లాడుతూ పాత నేరస్తుల్లో సత్ప్రవర్తన కోసం తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు చెప్పారు. పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన బిందుసాగర్

చౌటకూర్, ఏప్రిల్ 2: మండల కేంద్రమైన చౌటకూర్‌కు చెందిన బుర్కల బిందు సాగర్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని దోమలగూడ వ్యాయామ కళాశాలలో ఏడాదిగా బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపెడ్) చదువుతున్నాడు. జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో గత నెలలో జరిగిన సీనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగనున్న 56వ జాతీయ స్థాయి ఖోఖో పోటీ ల్లో తెలంగాణ జట్టు తరఫున ఆడనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జట్టుకు ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్కం నాగాగౌడ్ క్రీడా సా మగ్రి అందజేశారు. బుర్కల బిందుసాగర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికకావడంపై ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ, విశ్రాంత వ్యాయా మ ఉపాధ్యాయుడు రామకృష్ణ అభినందించారు.

ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు

చౌటకూర్, ఏప్రిల్ 2: ఉద్యోగ అవకాశాల కోసం విద్యార్థులకు ఉచిత కోర్సుతో పాటుగా టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్ అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు టెక్స్ అకాడమీ గ్రూప్ కంపెనీ సహకారంతో ఉపాధి నైపుణ్యాలపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ జోషీశ్రీపాద్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు అంతర్జాతీయ అవార్డులు

పుల్కల్, ఏప్రిల్ 2: ముంబైకి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నిర్వహించిన ఆర్ట్ పోటీల్లో సింగూరు గురుకుల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. సోయంమాలిక్ స్కె చింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి, మరో ఇద్దరికి మెరిట్ అవార్డులు, 15 మంది విద్యార్థులకు ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్ అవార్డులు, ఐదుగురు విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. వివిధ ఆర్ట్ విభాగాల్లో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ వరల్డ్ వైడ్ ఎక్సలెన్స్ పర్ఫామెన్స్ అవార్డు సాధించగా, ఆర్ట్ ఉపాధ్యాయుడు శ్రీపాద్ వరల్డ్ ఫేమస్ ఆర్టిస్ట్ సాల్వడార్ డాలీ అవార్డును అందుకున్నారు. పాఠశాల, కళాశాలకు సంబంధించి అంతర్జాతీయ గ్లోబల్ స్కూల్ అవార్డును వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కిరణ్ అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున్, ప్రవీణ్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జిన్నారం, ఏప్రిల్ 2: కాజిపల్లి శివారులోని ఓఆర్‌ఆర్‌పై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బొల్లారం సీఐ గంగాధర్ తెలిపిన కథనం ప్రకారం..ఖైరతాబాద్ ఏసీగార్డ్స్‌కు చెందిన షేక్ ఇసాక్(54) కాజీపల్లి ఓఆర్‌ఆర్‌పై అర్ధరాత్రి సమయంలో నడుస్తూ వెళ్తుండగా వెనుకనుంచి వేగంగా వచ్చిన స్విఫ్ట్ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయలైన ఇసాక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు షేక్ రుమాన్ ఫిర్యాదు మేరకు బొల్లారం సీఐ గంగాధర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఘటనా స్థలంలో ఒకరు, దవాఖానకు తరలిస్తుండగా మరొకరు మృతి
- బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే మాణిక్‌రావు పరామర్శ

నాదిల్, రేహాన్ (ఫైల్)

కోహీర్, ఏప్రిల్ 2: జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్ వంతెనపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని ఖాన్ మొహల్లాకు చెందిన రేహాన్(18), నాదిల్(16) ఇద్దరు బంధువులు. రంజాన్ ఉపవాసం ప్రారంభానికి ముందు టీ తాగేందుకు రాంనగర్ వంతెన గుండా బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు లారీ ఢీకొట్టింది. నాదిల్ ఘటన స్థలంలోనే మృతిచెందాడు. రేహాన్‌కు జహీరాబాద్ దవాఖానలో చికిత్స అందించారు. అక్కడ అతడి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో సంగారెడ్డి దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో తుదిశ్వాస విడిచాడు. జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించారు. రేహాన్ తండ్రి సమద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావు పరామర్శ

జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్ వంతెనపై మంగళవారం ఉదయం బైకును లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు రేహాన్, నాదిల్ ఇండ్లకు వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మృతదేహాల వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట షేక్ మొయిన్, మాజీ కౌన్సిలర్ జహంగీర్, ముర్తుజా ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేశ్

జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు, ఏప్రిల్ 2: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ రూపేశ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం పరిధిలోని లక్డారం చౌరస్తానుంచి పటాన్‌చెరు పట్టణం వరకు జాతీయ రహదారులపై ప్రయాణానికి ఎదురవుతున్న అడ్డంకులను డీఎస్పీ రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ తీవ్రంగా ఉన్న సమయంలో కంకర ట్రిపర్లు, పరిశ్రమల గూడ్స్ వాహనాలు రోడ్డుపైకి రాకుండా ఆంక్షలు పెడతామన్నారు. పరిశ్రమల ప్రతినిధులతో, ఐలా కమిటీతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇస్నాపూర్ చౌరస్తా, ముత్తంగి హరిదోశ వద్ద ఉన్న యూటర్న్‌లను పరిశీలించారు. పోచారం చౌరస్తాలో పేరుకున్న మట్టిదిబ్బలు తొలిగించేందుకు జాతీయ రహదారుల శాఖ అధికారుల సహాయం తీసుకుంటామన్నారు. పటాన్‌చెరు బస్టాండ్ ఎదురుగా ఏర్పడుతున్న తీవ్రమైన ట్రాఫిక్ జాంలను అరికట్టేందుకు అన్నిశాఖల అధికారులతో కలిసి ప్లానింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు. అక్రమ పార్కింగ్‌ను నిలువరిస్తామన్నారు. ముత్తంగి జంక్షన్‌లోని సిల్వర్ బావర్చి, స్వీట్‌హట్ హోటల్స్‌లతో పాటు పలు హోటల్స్‌కు అక్రమ పార్కింగ్‌పై నోటీసులు జారీ చేయాలని ట్రాఫిక్ అధికాలకు ఎస్పీ ఆదేశాలిచ్చారు. పటాన్‌చెరు రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలిగిస్తామన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి, ట్రాఫిక్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సూపరింటెండెంట్ సంగారెడ్డి

న్యాల్‌కల్, ఏప్రిల్ 2: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల సంఖ్యను పెంచేలా వైద్యాధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సూపరింటెండెంట్ సంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామంలోని కమ్యూనిటీ ఆరోగ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో పలు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం స్థానిక వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంతోపాటు సేవలను విస్తృత పరుస్తున్నట్టు తెలిపారు. సమయపాలన పటిస్తూ రోగులకు మెరుగైన సేవలను అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను రోజు తెరవాలని, వేసవిలో ముందస్తు జాగ్రత్తలతో మండు వేసవిని అందిగమిద్దామన్నారు. వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు బృష్ణు, నృపేన్‌చక్రవర్తి, వైద్య సిబ్బంది శ్యామల, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

న్యాల్‌కల్, ఏప్రిల్ 2: వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని మిర్జాపూర్(బి), న్యాల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు నృపేన్‌చక్రవర్తి, గణపతిరావు అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఆయా ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు, ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ వడదెబ్బకు గురైనా, వాంతులు, విరోచనాలతో ఇబ్బందులు పడుతున్న వారు వెంటనే ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్యామల, మల్లికార్జున్, మార్థ, ఏఎన్‌ఎంలు, ఈజీఎస్ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు

ఇఫ్తార్ విందులో మంత్రి దామోదర

కంకోల్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

మునిపల్లి, ఏప్రిల్ 2: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని కంకోల్ గ్రామంలో మంగళవారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైద్యారోగ్య శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రిని ముస్లింలు శాలువ, పూలమాలలతో సన్మానించారు.

నల్లవాగు కెనాల్ పనుల పరిశీలన

కెనాల్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ సీఈ, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సిర్గాపూర్/కల్హేర్, ఏప్రిల్ 2: మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు ప్రధాన కుడి కాల్వలో డిస్ట్రిబ్యూటర్ -4 వద్ద జరిగిన కెనాల్ అభివృద్ధి పనులను ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, ఎస్‌ఈ మురళీధర్ మంగళవారం పరిశీలించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సైతం కెనాల్‌ను పరిశీలించి సీఈతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. త్వరితగతిన కాల్వల ఆధునీకరణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే వారిని కోరారు. వీరివెంట ఖేడ్ ఈఈ భీమ్, డీఈఈ పవన్‌కుమార్, ఏఈ సూర్యకాంత్ , రైతులు, నాయకులు తదితరులు ఉన్నారు.

నల్లవాగు గురుకులం పరిశీలన

సిర్గాపూర్, ఏప్రిల్ 2: మండలంలోని సుల్తానాబాద్‌లోని నల్లవాగు సాంఘిక గురుకుల పాఠశాలను మంగళవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలో ఆయన కలియతిరిగి స్టోర్, వంటగది, తరగతి గదులను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యాభ్యాసన పట్ల ఆయన ఆరా తీశారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గురుకుల టీచర్లు, విద్యార్థులు, నాయకులు ఉన్నారు.

దాహం తీర్చడం అభినందనీయం

సంగారెడ్డి, ఏప్రిల్ 2: వేసవిలో ప్రజలు, బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాల ఏర్పాటు ఎంతో ఉపయోగకరమని, అలాగే కాలనీలో ఇంటింటికీ ట్యాంకర్‌తో మంచినీటిని సరఫరా చేయడం అభినందనీయమని జ్యోతిర్వాసు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి అన్నారు. మంగళవారం పట్టణంలోని మా ఇల్లు సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మంచినీటి సరఫరాను మహేశ్వర శర్మ సిద్ధాంతి ప్రారంభించారు. మాఇల్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజి అనంతకాషన్ మాట్లాడుతూ ఈ నీటి సరఫరా 100 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి పుల్లూరి ప్రకాశ్, ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పాంపాటి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, సభ్యులు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి

రాయికోడ్, ఏప్రిల్ 2: ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ ఎండ దెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. ఏమైనా పనులుంటే ఉదయం, సాయంత్రం వేళల్లో చేసుకోవాలన్నారు.

జొన్నలో గంజాయి సాగు

స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలను చూపుతున్న అధికారులు

ఝరాసంగం, ఏప్రిల్ 2: జొన్న పంటలో అంతర పంటగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను మంగళవారం ఆబ్కారీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ ఆబ్కారీ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారంతో ఝరాసంగం మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామ శివారులో ఓ రైతు జొన్న పంటలో సాగు చేస్తున్న రూ.8.20 లక్షల విలువచేసే 82 గంజాయి మొక్కలతోపాటు రూ.25 వేల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పంట పొలాల్లో అక్రమంగా గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆబ్కారీ ఎస్‌ఐలు రమేశ్, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యులకు ఇబ్బందులు కలిగించొద్దు

చిరు వ్యాపారులకు కౌన్సెలింగ్ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ భాస్కర్

సంగారెడ్డి, ఏప్రిల్ 2: సంగారెడ్డి పట్టణంలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు సామాన్య ప్రజానీకం, వాహనదారులకు ఇబ్బందులు కలిగించొద్దని పట్టణ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ సూచించారు. మంగళవారం ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చిరు వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యజమానులు తమ దుకాణాలకు వెనుకకు జరుపుకోవాలని, వాహనదారులు వాని వాహనాలను రోడ్డుపై పెట్టకుండా చూసుకోవాలసిన బాధ్యత దుకాణాల యజమానులదేనన్నారు. దుకాణం వ్యర్థాలను అక్కడే వదిలివెళ్లవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే న్యూసెన్స్ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అందరికీ ఆదర్శం వెంకటరమణా చార్యులు

వెంకటరమణా చార్యులు దంపతులను సన్మానించిన ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 2: తెలుగు పండిత్ ఉపాధ్యాయుడు వెంకటరమణా చార్యులు అందరికీ ఆదర్శప్రాయుడని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్సీపురం డివిజన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన వెంకటరమణా చార్యులు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరై సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 36 ఏండ్లుగా ఎందరినో ఉన్నత శిఖరాలకు చేర్చిన మహావ్యక్తి వెంకటరామణా చార్యులని అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులు, స్నేహితులు, విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో జెమినికుమారి, ప్రధానోపాధ్యాయులు రాథోడ్, విద్యారంగ ప్రముఖులు వసునందన్, ఆచార్యఫణీంద్ర, నాగభూషణం, మోహన్‌రెడ్డి, అంజయ్యాగౌడ్, వెంకటేశం, పూర్ణకృష్ణ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటిస్తున్న ఆర్డీవో వసంతకుమారి

సమావేశానికి గైర్హాజరైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎంపీటీసీలు

జిన్నారం, ఏప్రిల్ 2: జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో వసంతకుమారి ఉదయం 11గంటలకు అవిశ్వాసం ఏర్పాటు చేశారు. అవిశ్వాసం పెట్టిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు, ఇటు కాంగ్రెస్ ఎంపీటీసీలు సమావేశానికి హాజరుకాలేదు. గంటపాటు ఆర్డీవో వేచి చూసి 12గంటలకు 2/3వంతు కోరం లేకపోగా, సమావేశానికి ఎవరూ కూడా రాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటించారు. సమావేశంలో ఎంపీడీవో అరుణ, తహసీల్దార్ భిక్షపతి, సూపరింటెండెంట్ రాములు పాల్గొన్నారు. ఈ ప్రక్రియను అధికారులు వీడియో రికార్డ్ చేశారు. అవిశ్వాసం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద జిన్నారం సీఐ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో జిన్నారం, గుమ్మడిదల, హత్నూర పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

అందోల్, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా సిబ్బంది సహకరించాలని అందోల్-జోగిపేట ఆర్డీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పాండు సూచించారు. మంగళవారం జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు శిక్షణ తరగుతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని విషయాలపై తగిన శిక్షణ అవసరమన్నారు. 4, 6 తేదీల్లో రెండు రోజులపాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎన్నికల నియమ, నిబంధనల ప్రకారం అందరూ పనిచేయాలని సూచించారు.

ఎన్నికల అధికారుల పత్యేక తనిఖీ

బొల్లారం వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

పటాన్‌చెరు, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఎన్నికల అధికారి హరిశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో బొల్లారం సమీపంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ హరిశంకర్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల ఉల్లంఘనలపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వంద నిమిషాల్లో విచారణ ప్రారంభిస్తామన్నారు. రూ.50వేలకు పైగా నగదు ఉంటే సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ అధికారి సుభాష్, పోలీసులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

90 క్వింటాళ్లు సీజ్

కోహీర్, ఏప్రిల్ 2: జహీరాబాద్ పట్టణంలో టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 90క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. సయ్యద్ తాజుద్దీన్, డ్రైవర్ మౌలానాను అదుపులోకి తీసుకున్నారు. డీసీఎంతో పాటు నిందితులను జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

సర్వాయి పాపన్నగౌడ్‌ను వర్ధంతిని పురస్కరించుకొని కల్లుగీత కార్మిక సంఘం, గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జహీరాబాద్ పట్టణంతో పాటు కోహీర్ మండలంలోని వెంకటాపూర్‌లో, వట్‌పల్లిలో గౌడ సంఘం నాయకుల అధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 2

సంగారెడ్డి: సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోహీర్: జహీరాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

వట్‌పల్లి: వట్‌పల్లిలో నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు